ప్రజాశక్తి

శనివారం 13 డిసెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఆరంభం అట్టహాసం

కాగ్నిజెంట్ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తదితరులు

- కాగ్నిజెంట్ ఐటి సహా 9 సంస్థలకు సిఎం శంకుస్థాపన
- ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలను విశాఖకు తెస్తా
- అందుబాటులోకి ఎఐ వైద్యులు : చంద్రబాబు

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

కాగ్నిజెంట్ ఐటి సహా తొమ్మిది కంపెనీలకు ఒకేసారి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖ వేదికగా శుక్రవారం శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టారు. తొలుత కాపులుప్పాడ ఐటి హిల్స్ వద్ద ఐటి దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎకరా భూమిని 99 పైసలు చొప్పున 22.19 ఎకరాలను కాగ్నిజెంట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడంతో ఆ సంస్థ ప్రతినిధులు, ఉద్యోగుల్లో జోష్ కనిపించింది. శంకుస్థాపన కార్యక్రమాల్లో చంద్రబాబుతో పాటు ఆయన తనయుడు, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కూడా పాల్గొన్నారు. అన్ని కార్యక్రమాలను అట్టహాసంగా జరిపారు. కాగ్నిజెంట్ క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం కాగ్నిజెంట్ ప్రతినిధులు, ఉద్యోగులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ త్వరలోనే అందరి ఆరోగ్యానికి డిజిటల్ హెల్త్ రికార్డులతో పాటు ఎఐ డాక్టర్లను కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. సలహాలేమి కావాలన్నా ఎఐ డాక్టర్లను అడిగి సహాయం పొందవచ్చన్నారు.

ఆ రోజు హైదరాబాద్ ...ఈరోజు వైజాగ్

దాదాపు 30 ఏళ్ల క్రితం హైదరాబాద్‌ను ఐటి రంగంలో అభివృద్ధి చేశానని, ఈ రోజు అంతకు మించిన అభివృద్ధి వైజాగ్‌లో జరగడానికి కృషి చేస్తున్నానని చంద్రబాబు చెప్పారు. విశాఖలో అందమైన సాగర తీరం, ఉత్తములైన ప్రజలు ఉన్నారన్నారు. విశాఖకుండే ఈ ఫీచర్స్ దేశంలో ఏ నగరానికీ లేవని, ప్రపంచంలో కంపెనీలన్నీ విశాఖకు రావడానికే ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ చరిత్రను విశాఖలో సృష్టిస్తామని అన్నారు. కాగ్నిజెంట్ డేటా సెంటర్ ఈ ఏడాదిలో 25 వేల మంది ఉద్యోగులు పనిచేసే సెంటర్‌గా మారబోతుందన్నారు. అంతేగాక.. ఉమ్మడి విశాఖకు రెండో స్టీల్‌ప్లాంట్‌గా మిట్టల్ కంపెనీ వస్తోందని అన్నారు. విశాఖకు పోటీ మన దేశంలోని ఏ నగరాలూ లేవని, విశాఖకు ప్రపంచంతో పోటీ పడేందుకే 99 పైసలకే భూములు ఇచ్చామని చెప్పుకొచ్చారు.

చంద్రబాబు ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ఐటి ఉద్యోగులు

ఏడాదిన్నరలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు

కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో రూ.20 లక్షల కోట్లు పెట్టుబడులొచ్చాయని చంద్రబాబు అన్నారు. వీటి ద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు. గూగుల్ సంస్థ రూ.1.30 లక్షల కోట్లు, మైక్రోసాఫ్ట్ రూ.1.50 లక్షల కోట్లు, అమెజాన్ రూ.3.50 లక్షల కోట్లు, మెటా రూ.వెయ్యి కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. ఇంకా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, శ్రీహరికోట వద్ద శాటిలైట్ సిటీ, అనంతపురంలో ఏరోస్పేస్ సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. విశాఖలో మెడ్ టెక్ పార్క్ ద్వారా ప్రపంచానికే వైద్య పరికరాలు సరఫరా చేస్తున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి వెళ్లినా నీటి కొరత, భూమి, ఎనర్జీ కొరత ఉంటుందని, ఎపిలో అలా కాదని అన్నారు. రాష్ట్రంలో లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చి వ్యాపారస్తులకు సులువు చేయబోతున్నామని తెలిపారు. ఎపిలో అందరికీ స్మార్ట్ ఫోన్‌లు అందేలా ప్లాన్ చేస్తున్నామన్నారు.

శంకుస్థాపనలు ఇలా..

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ సంయుక్తంగా కంపెనీలకు శంకుస్థాపనలు చేపట్టారు. కాగ్నిజెంట్ క్యాంపస్ పూర్తయ్యేవరకు ఆ కంపెనీ కార్యకలాపాల నిర్వహణకు రుషికొండ ఐటి పార్క్ హిల్ నెంబర్ 2లోని మహతి ఫిన్‌టెక్ భవనాన్ని ప్రభుత్వం ఇప్పటికే కేటాయించగా దీన్ని మంత్రి లోకేష్ ప్రారంభించారు. టెక్ తమ్మి, సత్వా డవలపర్స్, ఇమాజిన్వేటివ్ టెక్ సొల్యూషన్స్, క్వార్క్స్ టెక్నో సాఫ్ట్, మిగతా 2లో..

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

విఐఆర్‌పై సమీక్ష

చంద్రబాబు సాయంత్రం ఎ-1 గ్రౌండ్‌లో రాష్ట్ర మంత్రులు, ఎంఎల్ఎలు, 9 జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో విశాఖ ఎకనమిక్ రీజియన్‌పై సమీక్షించారు. అనంతరం ఉత్తరాంధ్రలో నిర్మితమవుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిని స్వయంగా చూసేందుకు ఏరియల్ సర్వే నిర్వహించారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఐటి కంపెనీలకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు.

ఓట్ చోరీకి వ్యతిరేకంగా 14న ర్యాలీ

వార్త 2లో..

సోలార్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలి

వార్త 3లో..

స్టీల్‌ప్లాంట్ డంపింగ్ యార్డ్‌లో ప్రమాదం

వార్త 3లో..

సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో నిలిచిన ఉత్పత్తి

ప్రజాశక్తి – సీలేరు: ఉమ్మడి విశాఖ జిల్లా సీలేరు కాంప్లెక్స్ పరిధి జల విద్యుత్ కేంద్రం మూడో యూనిట్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచి పోయింది. ఇక్కడ 60 మెగావాట్ల చొప్పున సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఉన్నాయి. మూడో యూనిట్‌కు వారం రోజుల క్రితమే గవర్నర్‌లో లోపాలు తలెత్తాయి. దీంతో యూనిట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపి వేశారు. యూనిట్‌లో లోపాలు సరిచేయడానికి ఇఇ రాజేంద్రప్రసాద్, ఇంజినీర్లు కార్మికులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఫలితం దక్కలేదు. మరమ్మతు లోపాలను జెన్కో ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లారు. యూనిట్ మరమ్మతులు నిర్వహించడానికి ఆర్తో ఇంజినీరింగ్ కంపెనీని అధికారులు సంప్రదించారు. లోపాలను సవరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎపి జెన్కో అధికారులు వెల్లడించారు.

అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న వందలాది మంది అంగన్‌వాడీలు

అంగన్వాడీలకు వేతనాలు పెంచాల్సిందే

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు
- విశాఖ, అనకాపల్లిలో భారీ ధర్నాలు

పేజీ 5లో..

మొదటి పేజీ తరువాయి..

ఆరంభం అట్టహాసం

ఎసిఎన్ ఇన్ఫోటెక్, నాన్ ఆరెల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థలకు శంకుస్థాపనలు చేశారు. కాగ్నిజెంట్ సహా ఈ సంస్థలన్నీ రూ.3740 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నాయి. 41700 మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయని ముఖ్యమంత్రి, ఐటి మంత్రి ప్రకటించారు.

సొంత ఇంటికి వచ్చినంత ఆనందంగా ఉంది

కాగ్నిజెంట్ కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమంలో ఆ సంస్థ సిఇఒ రవికుమార్ ఉద్వేగ పూరిత ప్రకటన చేశారు. తన అమ్మ, అమ్మమ్మ (శ్రీకాకుళం వారని, తనది ఈ ప్రాంతమే అని, ఎన్నో ఏళ్ళ తర్వాత.. ప్రపంచంలో చాలా చోట్లా తిరిగాక.. కాగ్నిజెంట్ ఇక్కడకు రావడం ద్వారా తన సొంత ఇంటికి వచ్చినంత ఆనందంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. విశాఖ కాగ్నిజెంట్ సంస్థలో 25 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించారు. తొలుత 8 వేల మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పిస్తామని ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. కాగ్నిజెంట్ తాత్కాలిక క్యాంపస్‌ను మంత్రి లోకేష్ ప్రారంభించగా ఆ కార్యక్రమంలో కంపెనీ సిఇఒ ఎస్.రవికుమార్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గుమ్మడి సూర్య, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తిరుమల నారాయణన్, వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ హజ్రా, ఎంపీ శ్రీ భరత్, మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఐటి సెక్రటరీ కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సత్వ వాంటేజ్ వైజాగ్ క్యాంపస్‌కు భూమిపూజ

ఎంవిపి.కాలనీ : ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్‌లలో ఒకటైన సత్వ గ్రూప్ విశాఖపట్నంలో తన ప్రతిష్టాత్మక 'సత్వ వాంటేజ్ వైజాగ్ క్యాంపస్' నిర్మాణానికి అధికారికంగా శ్రీకారం చుట్టింది. 30 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,500 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ నెక్స్ట్-జెనరేషన్ మిక్స్‌డ్-యూజ్ డెవలప్‌మెంట్‌గా నిలవనుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం జరిగిన భూమిపూజ కార్యక్రమంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ఎపి ముఖ్యమంత్రి నాయకత్వంలో జరుగుతున్న మార్పునకు కీలక ప్రేరక శక్తిగా నిలిచి, 25 వేలకుపైగా ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టిస్తుందని అన్నారు. ఈ క్యాంపస్‌లో గ్లోబల్ - గ్రేడ్ ఎ ఆఫీసులు, ప్రీమియం రెసిడెన్సీలు, రిటైల్ హాస్పిటాలిటీ సదుపాయాలు ఉంటాయన్నారు.

ప్రదర్శనలతో ఆకట్టుకున్న చిన్నారులు

ఘనంగా బేతనీ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో బేతనీ పాఠశాల వార్షికోత్సవం వైభవంగా జరిగింది. బెంగళూరు గ్లోబల్ లీడర్‌షిప్ డెవలప్మెంట్ కేంద్రం డీన్, డాక్టర్ శామ్యూల్ టి. కోషి ముఖ్య అతిథిగా రాగా, ఆయనకు పాఠశాల వ్యవస్థాపకురాలు అనితా అయిడియన్జీ స్వాగతించారు. ఈ సందర్భంగా డాక్టర్ శామ్యూల్ పాఠశాల కరెస్పాండెంటును ప్రశంసించారు. ప్రిన్సిపల్, సిబ్బందితోపాటు చక్కని ప్రతిభను, సృజనాత్మకత ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. వార్షికోత్సవంలో నర్సరీ నుండి 4వ తరగతి విద్యార్థులు 700 మంది ప్రదర్శించిన స్వాగత నృత్యం, 'కోరమాండల్ ఫిషర్స్', 'ఓ కెప్టెన్ మై కెప్టెన్' వంటి కవితా రూపకాలు, మ్యూజికల్ 'ది పైడ్ పైపర్,', స్వచ్ఛభారత్ సందేశాన్ని చాటిన ప్రదర్శన, మరియు క్రిస్మస్ మెడ్లీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల సంగీతం, సంస్కృతిని ప్రతిబింబించే వివిధ ప్రదర్శనలు ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ ఎం. పీటర్ వందన సమర్పణ చేశారు.

మత్స్యకారులను తక్షణమే విడిపించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అక్టోబర్ 9వ తేదీన బంగ్లాదేశ్‌లో చిక్కుకుపోయిన 9 మంది మత్స్యకారులను తక్షణమే విడిపించుకునేలా చర్యలు చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని వాసుపల్లి గణేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆసీలుమెట్ట కార్యాలయంలో శనివారం వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీతో కలిసి శుక్రవారం గణేష్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల ఓట్లతో గెలిచి వారి బాగోగులు పట్టించు కోవడం లేదని మండిపడ్డారు. భోగాపురం నెల్లిమర్లకు చెందిన 9 మంది మత్స్యకారులు బంగ్లాదేశ్‌లో చిక్కుకుపోతే రెండు నెలలైనా వెనక్కి తీసుకువచ్చే ప్రయత్నం చేయకపోగా ఉపాధి కోల్పోయిన ఆయా మత్స్యకార కుటుంబాలకి కనీస సాయం అందించలేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఆయా 9 మంది మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేలు చొప్పున రూ.45 వేలు తోటి మత్స్యకారుడుగా సహాయం అందిస్తానని ఈ సందర్భంగా వాసుపల్లి ప్రకటించారు. జనసేన ఎమ్మెల్యే ఉన్న నెల్లిమర్ల ప్రాంతంలో మత్స్యకారులకు అన్యాయం జరిగితే పవన్‌కళ్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బంగ్లాదేశ్ నేవీకి చిక్కిన వారు బయటకు వచ్చేసరికి 6 నెలలు పడుతుందని చెప్పడం దారుణమన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేష్

సమస్యను తెలుసుకుంటున్న మంత్రి లోకేష్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పలు ఐటి సంస్థలకు శంకుస్థాపన చేసేందుకు విశాఖ చేరుకున్న విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం ఉదయం టిడిపి జిల్లా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్‌లో గత 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న విశాఖ విమల విద్యాలయాన్ని (స్టీల్ ప్లాంట్) ఏకపక్షంగా మూసివేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంట ున్నామని, తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయడంతో పాటు పెండింగ్ జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విశాఖ విమల విద్యాలయం స్కూల్స్ టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేన్ ఆధ్వర్యంలో సిబ్బంది మంత్రి లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. రెగ్యులర్ స్టాఫ్‌కు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. తన తండ్రికి ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిని దివకాల గంగారాజు ఆక్రమించారని, విచా రించి తగిన న్యాయం చేయాలని విశాఖ అంబేద్కర్ కాలనీకి చెందిన ఈర్ల అప్పలరాజు మంత్రిని కలిసి కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే మెడికల్ ఇన్ వాలిడేషన్ స్కీమ్‌ను ఆర్టీసీ ఉద్యోగులకు కూడా వర్తింపజేసి, పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సిబ్బంది మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. యలమంచిలి మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకటరమణమూర్తి రాజు(కన్నబాబు) ప్రోద్బలంతో తనపై నమోదు చేసిన రౌడీషీట్‌ను రద్దు చేయాలని అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం లోపాలెం గ్రామానికి చెందిన గనగళ్ల వివేక్ కోరారు.ఆయా వినతులను పరిశీలించి పరిష్కారానికి కషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఓట్ చోరీకి వ్యతిరేకంగా 14న ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఈ నెల 14న దేశ రాజధాని ఢిల్లీ రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ భారీ స్థాయిలో ఆగ్రహ ర్యాలీ నిర్వహిస్తుందని విశాఖ జిల్లా కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ అడ్డాల వెంకట వర్మ తెలిపారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యా లయంలో ర్యాలీకి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు చోరీ అనేది దేశ ప్రజాస్వామ్యానికి సంబంధించిన సమస్య అన్నారు. కనుక పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు ర్యాలీలో పాల్గొనాలని కోరారు. అలాగే అన్ని జిల్లాల కాంగ్రెస్ కమిటీలు ఈ ఆగ్రహ ర్యాలీలో పాల్గొంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిసిసి ప్రధాన కార్యదర్శి గాదం మహేష్,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు,జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్,ఎస్సీ సెల్ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతక స్థాయిలో వాయు కాలుష్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: రాష్ట్రప్రభుత్వం విశాఖపట్నాన్ని 'గ్లోబల్ డిజిటల్ గేట్వే'గా ప్రచారం చేస్తూ గర్వపడుతున్నప్పటికీ, ఇప్పుడు ప్రాణాంతక స్థాయికి చేరిన గాలి కాలుష్యం వల్ల విశాఖ ప్రజల జీవితం దుర్భరంగా మారిందని హ్యూమన్ రైట్స్ ఫోరం ఎపి, తెలంగాణ సమన్వయ కమిటి నాయకులు వి.ఎస్.కృష్ణ, జివిఎంసి సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు సోహన్ హట్టంగడి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శీతాకాలం మొదలవడంతో గాలి నాణ్యత సూచీ అన్ని భద్రతా పరిమితులను దాటిందన్నారు. ఇటీవల వచ్చిన ఒక మీడియా నివేదిక ప్రకారం, దేశవ్యాప్తంగా అత్యధిక కాలుష్యంతో ఉన్న నగరాలలో విశాఖ ఒకటిగా పేర్కొన్నారన్నారు. ప్రభుత్వ నినాదం అయిన 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఇప్పుడు నియంత్రణల పతనానికి, అదుపులేని కాలుష్యానికి లైసెన్సుగా మారిందని విమర్శించారు. నగరంలోని వేలాది కుటుంబాలు శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాయన్నారు. కాలుష్య నియంత్ర మండలి చట్టాన్ని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కారుకులను బాధ్యులుగా చేయాల్సిన ఇటువంటి నియంత్రణ సంస్థలు కాలుష్య కార్యకర్తలను రక్షించే విధంగా ప్రవర్తిస్తున్నాయని విమర్శించారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ కాపాడే విషయంలో విఫలమై ఈ సంస్థలు అత్యంత బాధ్యత రాహిత్యంగా ప్రవర్తిస్తున్నా యని ఆరోపించారు. పర్యావరణహితమైన ప్రాజెక్టుల వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు.

గుండె దడను నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ముప్పు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: గుండె దడను (పాల్పిటేషన్స్) చిన్న సమస్య గా నిర్లక్ష్యం చేయకూడదని, ఇది ప్రాణాంతకమైన హృదయ సంబంధిత కీలక సమస్యలకు ముందస్తు హెచ్చరిక కావచ్చని మెడికవర్ హాస్పిటల్స్ ఎలక్ట్రోఫీజిలోజిస్ట్ సీనియర్ ఇంటర్వెంషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.సురేష్ తెలిపారు. శుక్రవారం మెడికవర్ ఎంవిపి శాఖలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుండె ఒక్కసారిగా వేగంగా, బలంగా, అసమానంగా లేదా గ్యాప్ ఇచ్చి కొట్టుకున్నట్లు అనిపించే పరిస్థితిని పాల్పిటేషన్స్ గా పేర్కొన్నారు. జీవనశైలి మార్పులు, అధిక ఒత్తిడి, శారీరక శ్రమ, కేఫిన్ పానీయాలు, థైరాయిడ్ సమస్యలు, రక్తహీనత, రక్తపోటు మార్పులు, హైపోగ్లైసీమియా, ఎలక్ట్రోలైట్ అసమ తుల్యతలు వంటి అనేక కారణాలు పాల్పిటేషన్స్‌కు దారితీస్తాయన్నారు

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో.
E.P 50/2025 IN O.S 78/2017

బిట్వీన్
1. డాక్టర్ (శ్రీధరాల లక్ష్మీనారాయణ గుప్తా (డ్రెడ్)
2. (శ్రీధరాల వైదేహి.
3. (శ్రీధరాల ఆశీష్.
4. (శ్రీధరాల ఆదిత్య ...DHRs.

అండ్
1.పొట్నూరు సుకన్య (డ్రెడ్)
2. పొట్నూరు సాయి కృష్ణ.
3. పొట్నూరు గౌతమ్ కృష్ణ ...JDRs.

2,3 JDRలకు నోటీస్

2. పొట్నూరు సాయి కృష్ణ. తండ్రి శ్రీనివాసరావు. డోర్ నెంబర్ 3-7-20, నరసింగరావుపేట, అనకాపల్లి.
3. పొట్నూరు గౌతమ్ కృష్ణ. తండ్రి శ్రీనివాసరావు, డోర్ నెంబర్ 3-7-20, నర్సింగరావుపేట, అనకాపల్లి.

పై నెంబరు అమలులో 2,3 JDR ల స్వాధీనంలో ఉన్న షెడ్యూల్ ఆస్తిని DHR లు తమకు అప్పగించమని కోరుతూ పై నెంబరు అమలు దాఖలు చేయగా, సదరు అమలులో 2,3 JDR లకు పై కోర్టు వారు పంపిన నోటీసులు తీసుకోకుండా ఎగవేయుచున్నారు. అందువలన పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 23-12-2025 వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు ఉదయం 10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయర్ గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపన్లను తెలుపుకొనవలెను, లేనిచో మీ పరోక్షమందు పై అమలు తీర్మానించబడును.

(పై కోర్టు వారి ఆర్డర్)
K.P.V. రమణయ్య.
DHRs తరపు అడ్వకేట్, అనకాపల్లి.
cell : 9849372565.

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో గాజువాక
I.A. 839/2025 in I.A. 853/2024 in O.S. 397/2024

మధ్య:
Bonthu Hari Venkata Sai Mani Kalyan
S/o. Kanaka Rao, R/at. D.No. 19-1-1
Pedakorada, Pedagantyada,
Viskhapatnam . . . Petitioner/Plaintiff
And:
1. Saripalli Appala Narasimha Raju
2. Smt. Saripalli Latha,
. . . Respondents/Defendants

To:
1.Saripalli Appala Narasimha Raju,
S/o. Venkata Raju, R/at D.No. 10-53-6,
Nehru Nagar, Ram Nagar,
Visakhapatnam-530020.
Cell : 7702205672, 7793912339
2. Smt. Saripalli Latha,
W/o. S.Appala Narasimha Raju, ,
R/at D.No. 10-53-6, Nehru Nagar,
Ram Nagar, Visakhapatnam-530020.
Cell : 7702122456

పై నెంబరు గల దావా వాదిగారు ప్రతివాదులు అయిన మీపై మీ వద్ద నుండి బాకీ మొత్తము రాబట్టు నిమిత్తము వేసియున్నారు. కావున సదరు దావా మీ హాజరు నిమిత్తము **తే:23-12-2025దీకి** వాయిదా అయివున్నది. కావున ఆ తేదీన మీరు స్వయంగా గానీ లేదా సరియైన భోగట్టా ఇవ్వబడిన వకీలు ద్వారా గానీ ఆరోజు **ఉదయం 10-30 గంటలకు** పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనియెడల సదరు దావా మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

యస్.రాజేశ్వరరావు, అడ్వకేట్,
గాజువాక సెట్: 9346084087

IN THE HONOURABLE COURT OF THE IIIrd ADDITIONAL JUNIOR CIVIL JUDGE - CUM - SPECIAL (EXCISE) JUDICIAL MIGISTRATE OF 1st CLASS AT VIZIANAGARAM
O.S.NO.790/2022

Between:
Kandibora Appala Naidu and others
....Plaintiff
And :
Chandaka Ramana and others
...Defendant

To
D1. Chandaka Ramana S/o Suri Babu, Anandapuram Village and Mandal, Visakhapatnam District.

పైన ఉదహరించిన దావాలో పరిహారం నిమిత్తం నీ మీద దావా చేసియుండుట వలన శ్రీ కోర్టువారు సదరు ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు, దావా సమన్లు పంపినను అందుకొనక బుద్ధిపూర్వకముగా కాలయాపన చేయుచున్నాడు. సదరు దావా వాయిదా **తే 29-12-2025దికి ఉన్న, తేదిన 10-30 గంటలకు** యీ కోర్టులో హాజరు కావలెను.

సదరు ప్రతివాది అయిన మీరు పైన ఉదహరించిన వాయిదా తేదికి స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని శ్రీకోర్టువారి ఎదుట హాజరై సదరు దావా విషయములు సదరు ప్రతివాది మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

Sri Badukonda Neeladri Rao
Advocate, Vizianagaram

సోలార్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలి

సమీక్షలో మాట్లాడుతున్న సిఎస్ విజయానంద్

● అధికారులతో సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఈ నెలాఖరులోగా ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ ప్రారంభానికి ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని 11 జిల్లాలు సిద్ధం కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ఒకేసారి వర్చువల్ శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. శుక్రవారం విశాఖపట్నం సందర్శనలో భాగంగా సిఒఇఐటిలో అధికారులతో సమీక్ష సమావేశంలో పిఎం కుసుమ్, సూర్యఘర్ పథకం, ఫీడర్ లెవెల్ సోలారైజేషన్, ఎస్సి,ఎస్టి రూఫ్ టాప్ సోలార్, పీఎం ఈ డ్రైవ్ పథకాలతోపాటు అన్ని ఎంఎన్ఆర్ఇ ప్రాజెక్టులు, ఆర్డిఎస్ఎస్, వివిధ పథకాలపై ఎపిఇపిడిసిఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, నెడ్ క్యాప్ ఎండి ఎం.కమలాకరబాబు, కలెక్టర్లు, విద్యుత్ అధికారులతో సమీక్షించారు. ముందుగా సిఎండి పృథ్వీతేజ్ సంస్థ చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. పిఎం సూర్యఘర్ కింద ఇప్పటివరకు 35,676 గృహాలకు 114 మెగావాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని, నెలకు 10 మెగావాట్ల చొప్పున జరుగుతున్న ఇన్‌స్టాలేషన్లను, రోజుకు ఒక మెగావాట్ సామర్థ్యానికి పెంచే చర్యలు చేపట్టామని వివరించారు. చీఫ్ సెక్రటరీ విజయానంద్ మాట్లాడుతూ సంస్థ పరిధిలోని ఎస్సి, ఎస్టి గృహ వినియోగదారులకు వారి సమ్మతితో మార్చిలోగా రెండు లక్షల ఇళ్లకు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు పనులను వేగవంతం చేయాలిలని ఆదేశించారు. ఒక్కో ఇంటిపై రెండు కిలోవాట్ల చొప్పున 400 మెగావాట్ల సామర్థ్యంతో రూఫ్ టాప్ సోలార్ పనులను పూర్తి చేయాలన్నారు. . పీఎం కుసుమ్ పథకం కింద ఫీడర్ సోలరైజేషన్‌లో సంస్థ పరిధిలోని 8 జిల్లాల్లో 220 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్లకు భూసేకరణను వేగవంతం చేయాలన్నారు. పీఎం ఈ డ్రైవ్' పథకం కింద వెహికల్ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులను వెంటనే చేపట్టాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న విద్యుత్ పంపిణీ పునర్వవస్థీకరణ పథకం (ఆర్‌డిఎస్ఎస్) కింద భూగర్భ విద్యుత్ కేబుల్, కవర్డ్ కండక్టర్, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర వినియోగదారులకు 24X7 త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాకు వ్యవసాయ ఫీడర్ల విభజన పనులను సకాలంలో పూర్తి చేయాలని' అధికారులను ఆదేశించారు. సమావేశంలో అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్లు విజయ కృష్ణన్, ఎస్ఇ రామసుందర రెడ్డి, స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎన్. ప్రభాకర రెడ్డి, ఈపిడిసిఎల్ డైరెక్టర్లు టివి. సూర్యప్రకాష్, టి. వనజ, ఎస్. హరిబాబు, సీజీఎంలు ఎల్. దైవప్రసాద్, వి. విజయలలిత, బి. అశోక్ కుమార్, పి. శ్రీనివాస్, సిజిఎంలు ఎల్. దైవప్రసాద్, వి. విజయలలిత, బి. అశోక్ కుమార్, పి. శ్రీనివాస్, ఎస్ఇలు, ఇఇలు పాల్గొన్నారు.

మహోద్యమంలా ఇంధన పొదుపు

సీతమ్మధార: ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపును మహోద్యమంగా చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పిలుపునిచ్చారు. ఈ నెల 14 నుంచి 20 వరకు ఇంధన పరిరక్షణ వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇంధన పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా ప్రజల్లో అవగాహన విస్తృతస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహించాలన్నారు.

ఢిల్లీ ధర్నాలో నినదించిన పెన్షనర్లు

జంతర్ మంతర్ ధర్నాలో పాల్గొన్న జిల్లా పెన్షనర్లు

ప్రజాశక్తి-తగరపువలస : తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఇపిఎస్ 95 పెన్షనర్ల చలో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర జీత్‌కౌర్ మాట్లాడారు. రూ.9వేలు కనీస పెన్షన్ చెల్లింపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. ధర్నాలో ఎపి పెన్షనర్ల సంఘం కార్యదర్శి కె.సత్తిరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి సుధాకర్ జిల్లా కార్యదర్శి హుస్సేన్, తెలంగాణ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, చిట్టివలస పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర్ బాబాజీ. కార్యదర్శి మోర.అప్పలరాజు. దల్లి రాంబాబు ఇప్పాక. సూరిబాబు.పట్నాల సత్యం .పెంటయ్య .వేముల అప్పల రెడ్డి పాల్గొన్నారు

విజన్ బిల్డింగ్‌పై ముగిసిన శిక్షణ

మాట్లాడుతున్న డిపిఎం వైదేహి

ప్రజాశక్తి-అనందపురం: మహిళా సంఘాల సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ట స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక కీలకమనిడిఆర్‌డిఎ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బి.వైదేహి , స్త్రీనిధి ఎజిఎం శ్రీనుబాబు అన్నారు. స్థానికమండల మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన విజన్ బిల్డింగ్‌పై డ్వాక్రా మహిళలకు నాలుగురోజుల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ, రానున్న ఐదేళ్లలో గ్రామ, మండల సమాఖ్య ప్రతినిధులు సామాజిక, ఆర్థికరంగాల్లో అభివృద్ధి చెంది వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎపిఎం ఎస్తేరు రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఎల్‌సిసి ఎండి.కృష్ణమూర్తినాయుడు, సిసిలు అప్పల నాయుడు, జానకి, రమణమ్మ పాల్గొన్నారు

స్టీల్‌ప్లాంట్ డంపింగ్ యార్డ్‌లో ప్రమాదం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ డంప్‌యార్డ్‌లోని మెటల్ పిట్‌లో ఎస్ఎంఎస్ విభాగంలోని లోహపు వ్యర్థాలను వేస్తున్న సమయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా భారీ పేలుడు సంభవించడంతో కార్మికులంతా భయాందోళనలతో పరుగులు తీశారు. అగ్నిమాపక దళాలకు సమాచారమివ్వడంతో వారు వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి కారణంపై ఆరా తీయగా, ప్రాథమిక సమాచారం ప్రకారం, ద్రవ లోహం నీటితో కలవడం వల్ల ఆవిరి రావడంతో మంటలు చెలరేగి, పేలుడు సంభవించి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఆయిల్ లీకేజీ కారణంగా మంటలు వేగంగా వ్యాపించి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో కార్మికులు ఊపిరిపీల్చుకున్నారు.. గతంలో స్టీల్ మెల్టింగ్ షాప్-2 , బ్లాస్ట్ ఫర్నేస్ ప్రాంతాల్లో ఇదే తరహా ఘటనలు చోటుచేసుకోవడంతో ఆ కోణంలో అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

రాజుకుంటున్న మంటలు

అధికారులకు సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి

ప్రత్యేకాధికారి ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని కొవ్వాడ గ్రామంలో మండల ప్రత్యేక అధికారి కె. జ్ఞానవేణి శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కొవ్వాడలో హౌసింగ్ లేఅవుట్‌ను, గ్రామంలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. సచివాలయాన్ని సందర్శించారు ,వైద్య ఆరోగ్య శాఖ రికార్డుల పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. సందర్శనలో ఎంపిడిఒ వి.నగేష్, డిప్యూటీ ఎంపిడిఒ బివి.రమణ, జిఎన్‌డబ్ల్యుఎస్ ఆర్‌కె.నాయుడు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

గీతం 'స్మార్ట్ ఐడియాథాన్"లో నిపుణుల సందేశం

ప్రజాశక్తి-మధురవాడ : యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని పలువురు విద్యావేత్తలు, పరిశ్రమల, సామాజిక నిపుణులు పిలుపునిచ్చారు.ఉద్యోగాల కోసం ఎదురుచూసేవారి కంటే, ఉద్యోగాలు సృష్టించే వారి చేతుల్లోనే యువత భవిష్యత్తు ఉందని అభిప్రాయపడ్డారు. శుక్రవారం గీతం విశ్వవిద్యాలయంలో స్మార్ట్ ఐడియాథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికాలోని నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీ, సెంటర్ ఫర్ ఎమర్జింగ్ మార్కెట్స్ ఫౌండింగ్ డైరక్టర్ డాక్టర్.రవిరామమూర్తి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా భారీ పరిశ్రమల కంటే చిన్న, మధ్య తరహా పరిశ్రమలే అనేక ఉద్యోగాలను సృష్టిస్తున్నాయన్నారు. యువత ఉద్యోగాలు కోసం కాకుండా ఉద్యోగాలు సృష్టించే పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీలో అమలు చేస్తున్న ఎక్స్‌పీరియెన్సియల్ లెర్నింగ్ మోడల్ గురించి వివరించారు. అదే యూనివర్సిటీకి చెందిన ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డైరక్టర్ గ్రేగ్ కాలియర్ మాట్లాడుతూ స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రముఖ విశ్వవిద్యాలయల్లో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ఉద్యోగావకాశల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. స్టార్టప్‌లు ప్రారంభించడానికి యువత ముందడుగు వేయాలని, మొదటి సారి విఫలమైతే అది కూడా భవిష్యత్తు విజయానికి అనుభవం అవుతుందని ప్రోత్సహించారు. మానవ హక్కుల కార్యకర్త, కిరణ్ చుక్కపల్లి ఏటికొప్పాక హస్త కళాకారుడు డాక్టర్ సివి.రాజు గీతం సైన్స్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ అనంతరామకృష్ణ బిజినెస్ స్కూల్‌డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, ప్రో వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, సంగీత దర్శకుడు రమణ గోగుల, డాక్టర్ అరుణాచలం మురుగనంతం పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : కూర్మన్నపాలెం భరత్‌నగర్‌లో యువకుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు నుంచి అందిన సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వివరాలివి.

కూర్మన్నపాలెంలో ఒక కార్ సర్వీస్ సెంటర్లో పనిలో చేరిన అల్లూరి జిల్లా, సంకడ పంచాయతీ, పెద్ద జాడమూరు గ్రామానికి చెందిన వేములపూడి విజయ్ కుమార్ (28) అలియాస్ నందు కొన్నాళ్లపాటు సర్వీస్ సెంటర్ యజమాని ఇచ్చి గదిలోనే ఉన్నారు. ఐదు రోజుల క్రితం మృతుడి ప్రియురాలిగా భావిస్తున్న యువతితోపాటు మరో వ్యక్తి అక్కడికి రావడంతో యజమాని సూచనల మేరకు గదిని ఖాళీ చేసి భరత్‌నగర్‌లో ఇంటిని అద్దెకు తీసుకుని అందులో ఉన్నాడు. అయితే ఐదురోజుల క్రితం విజయ్‌కుమార్ గదికి వచ్చిన యువతి, యువకుడు గదికి తాళాలు వేసి వెళ్లిపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గదిని తెరిచి చూడగా విజయ్ విగతజీవిగా పడిఉన్నాడు. అతనిమెడపై కోసిన గాయాలు స్పష్టంగా కనిపించడంతో పోలీసులు దీన్ని అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేశారు. అక్కడకు వచ్చిన వ్యక్తులకు ఫోను చేయగా, రెండూ స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో కేసు మరింత అనుమానాస్పదంగా మారింది. ప్రేమ సంబంధాల నేపథ్యంలో ఈ ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. హత్య కోణంలోనే విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని కెజిహెచ్ మార్చురీకి తరలించారు.

లారీ ఢీకొని బైకిస్టు దుర్మరణం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన యలమంచిలి మండలం, రేగుపాలెం జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. యలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం... నక్కపల్లి మండలం, నెల్లిపూడి గ్రామానికి చెందిన మాడుగుల నాగు (36) శుక్రవారం యలమంచిలి టౌన్‌లో ఉన్న తన అత్తగారి ఇంటికి పల్సర్ బైక్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో యలమంచిలి మండలం, రేగుపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి సుమారు 10.15 గంటల సమయంలో అనకాపల్లి వైపు నుండి వస్తున్న టిఎస్08యుబి 2748 నెంబర్ గల లారీ వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగు రోడ్డుపై పడిపోగా అతను పైనుండి లారీ టైరు వెళ్లిపోవడం వలన పొట్ట, తలభాగంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నాగు భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఆటోలు ఢీ: మహిళ మృత్యువాత

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని అయ్యప్పపాలెం సమీపంలో శుక్రవారం సాయంత్రం ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్న సంఘటనలో ఒక మహిళ మృతి చెందగా మరికొందరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే గొలుగొండ మండలం నల్లంకి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎస్.ధర్మరాజు వరి కోతల నిమిత్తం మహిళలను నర్సీపట్నం తీసుకొని వెళ్లి తీసుకు వస్తున్నాడు. ఈ ఆటోను మరో ఆటో ఢీకొన్న ఘటనలో చీడిగుమ్మల పంచాయతీ పోలవరం గ్రామానికి చెందిన అడ్లబోయిన లక్ష్మీ అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. బాధితులను ఏరియా ఆసుపత్రికి తరలించారు. గొలుగొండ ఎస్ఐ పీ. రామారావు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

అడ్డగోలు పార్కింగ్‌తో ప్రమాదాలు

ప్రజాశక్తి- కొమ్మాది : మధురవాడ శివశక్తినగర్ 80అడుగుల రోడ్డులో అనధికార అడ్డగోలు పార్కింగ్‌లతో ప్రమాదాలు జరుగుతున్నాయి. శుక్రవారం ఇదే రోడ్డులో అడ్డంగా ఉంచిన కాంక్రీట్ మిల్లర్‌ను ఢీకొని వ్యక్తి గాయపడ్డాడు. ప్రమాద ఘటనలపై ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు, .శివశక్తినగర్ రోడ్డు మొత్తం ఆక్రమించి అక్రమంగా పార్కింగ్‌లు, వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలకు కారణమౌతున్నాయని వాపోయారు.

జివిఎంసి, టౌన్ ప్లానింగ్ అధికారుల తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరే ప్రమాదాలకు ఆస్కారమిస్తోందని, ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన

జాబ్‌మేళా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి- గాజువాక : ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో గాజువాక శ్రీనగర్‌లోని టిఎస్ఆర్ టిబికె కాలేజీలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించిన జాబ్‌మేళాలో సుమారు 50 కంపెనీల ప్రతినిధులు పాల్గొని, భారీగా హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగార్హత పొందిన అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ, విద్య, ఉద్యోగావకాశాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో చర్యలు చేపడుతోందని, నిరుద్యోగ యువత నైపుణ్యాలను పెంపొందించుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేషన్ ప్రతినిధి డాక్టర్ క్రిస్, డి బాలకృష్ణ, స్థానిక కార్పొరేటర్లు, కూటమి నేతలు పాల్గొన్నారు.

జాతీయ జూడో పోటీలకు ఎంపిక

రెల్లి సురేష్, నమ్మి చిట్టెమ్మ

ప్రజాశక్తి తగరపువలస / పద్మనాభం : జాతీయ స్థాయి సీనియర్ జూడో పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు విశాఖపట్నం జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో భీమునిపట్నం మండలం వలందపేటకు చెందిన నమ్మి చిట్టెమ్మ, పద్మనాభం మండలం.రేవిడి గ్రామానికి చెందిన రెల్లి సురేష్ ఎంపికయ్యారు. ఈనెల 16న మణిపూర్ రాజధాని ఇంపాల్‌లో జరిగిన జాతీయ పోటీల్లో వీరు పాల్గొంటారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పలువురు అభినందించారు.

రేపు రక్తదాన శిబిరం

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, చిన్నారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సన్ స్కూల్ వేదికగా ఈనెల 14న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నీడీ వెల్ఫేర్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు తెలిపారు.శుక్రవారం స్కూల్‌లో విలేకరులతో మాట్లాడుతూ రక్తదానానికి యువత ముందుకు రావాలని కోరారు సమావేశంలో నీడీ వెల్ఫేర్ సభ్యులు ఎం.షణ్ముఖరావు, ఎం సూర్య శ్రీనివాస్, వి శ్రీనివాసరెడ్డి, ఆర్ బసవ కృష్ణమూర్తి పాల్గొన్నారు. అనంతరం రక్తదానం ప్రాధాన్యతను తెలుపుతూ విద్యార్థులతో కలిసి వాల్‌పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు.

ఆకట్టుకున్న సైన్స్ నమూనాలు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 59వ.వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలోని ప్రతిభ హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వాయికాలుష్యం, వర్షపు నీటి సద్వినియోగం, సోలార్ సిస్టం, గ్లోబల్ వార్నింగ్, సోయల్ మయిషార్ సేనర్ వంటి నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. సైన్స్ ఫెయిర్ తిలకించిన ములగాడ తహశీల్దార్ రమేష్, కోరమండల్ ఇంజినీరింగ్ విభాగం అధికారి లోకేష్, సిఎస్ఆర్ ప్రతినిధి వెంకటరమణ, 59వ వార్డు కార్పొరేటర్ పుర్రి పూర్ణశ్రీ సురేష్ ,పూడి మల్లేష్, రామకృష్ణ తదితరులు అభినందించారు. విద్యార్థుల సృజనాత్మకను ప్రశంసించారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గాల ఎన్నిక

ప్రమాణస్వీకారం చేస్తున్న ఆనందపురం మండల యుటిఎఫ్ కమిటీ

ప్రజాశక్తి-గాజువాక : జిల్లాలోని ఆనందపురం, గాజువాక మండలాల యుటిఎఫ్ నూతన కమిటీ కార్యవర్గాల ఎన్నిక నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం కొత్త గాజువాక పాఠశాలలో గాజువాక, పెదగంట్యాడ, ములగాడ మండలాల యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో గాజువాక మండల కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఇమంది ప్రసాద్, సబ్బారపు నూకరాజు, గౌరవ అధ్యక్షులుగా కె.మురళీకృష్ణ, సహ అధ్యక్షులుగా మహ్మద్ అబ్దుల్ హక్, బి..సుగుణ, కోశాధికారిగా ఎస్వి.శ్రీనివాస్ మహిళా కార్యదర్శులుగా జె..లక్ష్మి కుమారి, సిహెచ్వి.లక్ష్మి, ఎస్.అపరంది, జిల్లా కౌన్సిలర్స్‌గా ఎన్.శ్రీనివాస్‌రాజు, ఎస్..విజయకుమార్, ఎ.శివ,ఎ..విజయకుమారి, వి.ఎస్తేరురాణి, మండల కార్యదర్శులుగా ఎం..అనిత కుమారి ఎస్..నిరుపమ పరదేశి, ఎస్.సౌజన్యకుమారి, డి..నూకరాజు, కె.రజిని, ఆడిట్ కమిటి సభ్యులుగా జి.నీరజ, పి..విజయదుర్గ, సిపిఎస్ కన్వీనర్స్‌గా ఎ.రవి కుమార్, షేక్ హుస్సేన్‌బీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ తీరు సరికాదు

ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ తీరు సరికాదని యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్. అన్నారు. గాజువాకలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చి ఇపుడు విస్మరించిందన్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల గత వైసిపి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి, ఆర్థిక బకాయిలు చెల్లించకుండా వేధించిందన్నారు. ఇపుడు అదేబాటలో కూటమి ప్రభుత్వం నడుస్తోందన్నారు. ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలని, వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో సెలవు దినాలు మినహాయించాలని, ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటు చేసి, 29శాతం మధ్యంతర ఉపశమనాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేసేందుకు సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలన్నారు. ఈనెల 14న విశాఖపట్నంలో జరగనున్న యుటిఎఫ్ 50వ జిల్లా కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎ..విజయకుమారి, యుటిఎఫ్ సీనియర్ నాయకులు నెల్లిసుబ్బారావు, మాజీ ప్రధాన కార్యదర్శి టి..అప్పారావు,జిల్లా కార్యదర్శి మహ్మద్ రిజ్వాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇమంది శ్రీనివాస్, సబ్బారపు నూకరాజు

ఎంవిఎస్ ప్రసాద్, అవతారం

ఆనందపురం : మండలంలోని లోడగలవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా ఎం.వి.ఎస్. ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్. అవతారంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మండల కమిటీ గౌరవాధ్యక్షునిగా బిఎన్‌వి.కిరణ్‌కుమార్, అధ్యక్షునిగా ఎంవిఎస్. ప్రసాద్, సహాధ్యక్షులుగా సురేష్, పిన్నింటి శ్రావణి, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్. అవతారం, కోశాధికారిగా గిడుతూరి రాజా, కార్యదర్శులుగా ఎస్‌వివిఆర్ఎస్. నాయుడు, మాడెం సత్యనారాయణ, జి.రాజు, ఎస్.హరిప్రసాద్, గొన్న దాసునాయుడు, ఎస్‌వి. మహేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వి. సుందరబాబు జిల్లా కౌన్సిలర్లుగా జి.శ్రీను, వివిగిరి, వై.భాస్కర్, సత్యానందం, వై.ఉమాదేవిలను ఎన్నుకున్నారు.

టెన్త్ మోడల్ పేపర్ల ఆవిష్కరణ

కార్యక్రమంలో భాగంగా యుటిఎఫ్ ప్రచురించిన 10వ తరగతి మోడల్ పేపర్లను ఎంఇఒలు జోగేంద్రనాథ్ కె. గంగరాజు ఆవిష్కరించారు.

సత్యవతి కుటుంబానికి పరామర్శ

పరామర్శిస్తున్న నర్సింగరావు, జగ్గునాయుడు, తదితరులు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : సింధియా న్యూ కాలనీలో నివాసం ఉండగా,ఆంధ్రా స్టీల్ కాలనీలో పేద పిల్లలకు ఉచిత విద్యను అందించే ఉపాధ్యాయిని ఈటి సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. సత్యవతి కుటుంబాన్ని శుక్రవారం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి పరామర్శించారు.సత్యవతి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈటి సత్యవతి పేద పిల్లలకు ఉచిత విద్యను అందించడంలో ఆమె భర్త బాబూరావు, ఇతర కుటుంబసభ్యులు ఎంతగానో ప్రోత్సాహించారు. బాబూరావు హిందుస్థాన్ షిప్‌యార్డ్ డ్రై డాక్ విభాగంలో పనిచేసి, ఉద్యోగ విరమణ చేశారు. పరిశ్రమలో విధులు నిర్వహిస్తూనే, షిప్ యార్డ్, మల్కాపురం జోన్ పరిధిలో ప్రజాశక్తి దినపత్రిక సర్కులేషన్‌కు ప్రధాన బాధ్యునిగా సేవలు అందించారన్నారు. సత్యవతి ఇద్దరు కుమార్తెలు సునీత, సంధ్య ప్రైవేట్లు ఉపాధ్యాయినిలుగా పనిచేస్తున్నారన్నారు. సత్యవతి భర్త, కుమార్తెలు, అల్లుళ్లు,మనవరాళ్లను పరామర్శించిన సిపిఎం ప్రజాసంఘాల నేతలు, వారికి సంతాపాన్ని తెలిపారు.

దిగ్విజయంగా జాతీయస్థాయి హ్యాక్‌థాన్

విద్యార్థులతో మాట్లాడుతున్న అతిథులు

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలో శొంఠ్యాంలోని నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 24 గంటల జాతీయ స్థాయి హ్యాక్‌థాన్ పోటీలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 528 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఎన్ఎస్టిఎల్ సైంటిస్ట్-ఎఫ్, ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ విభాగాధిపతి కోట శ్రీకాంత్, డైడాక్టిక్ ఫెస్టో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి హరీష్ నాచని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో టెక్నాలజీ వేగంగా మారుతున్న నేపథ్యంలో వినూత్న ఆలోచనలు, సృజనాత్మకత, టెక్నికల్ నైపుణ్యాలు కీలకమన్నారు. హ్యాక్‌థాన్ వంటి పోటీలు విద్యార్థుల్లో కొత్త ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. ముఖ్య అతిథి హరీష్ నాచ్నని మాట్లాడుతూ జాతీయస్థాయి హ్యాకథాన్‌లో మొదటి మూడు స్థానాలు సాధించిన టీమ్‌లకు ఉచిత ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్. ఎన్.ప్రసాద్ రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. శంభుప్రసాద్, సిఎంఒ డాక్టర్ పి. సుబ్బరాజు పాల్గొని అతిథులను సత్కరించారు. ఈవెంట్ కన్వీనర్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ బి. శివ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు. హ్యాక్‌థాన్‌లో విజేతలకు రూ50వేలు నగదు బహుమతి అందజేస్తామని కాలేజీ కార్యదర్శి డాక్టర్ ప్రసాద్‌రాజు ప్రకటించారు.

వ్యక్తిత్వ వికాసమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

ప్రజాశక్తి -ములగాడ : వ్యక్తిత్వ వికాసమే ఎన్ఎస్-ఎస్ లక్ష్యమని జాతీయసేవా పథక జిల్లా నోడల్‌అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మధురవాడ శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎండాడలో ప్రత్యేక సేవా శిబిరంలో మాట్లాడుతూ, సామాజిక సేవ, వ్యక్తిత్వ వికాసం జాతీయ సేవా పథకానికి రెండు కళ్ల వంటివన్నారు.సిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ యు.లారెన్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుధాకర్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ప్రశాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంపై దృష్టి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నాగబాబు

ప్రజాశక్తి- వేపగుంట : పార్టీ బలోపేతమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు అన్నారు. శుక్రవారం వేపగుంట నుంచి పినగాడి జంక్షన్‌కు వెళ్లే మార్గంలో మీనాక్షి కన్వెన్షన్ సెంటర్లో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, త్వరలో రాష్ట్రస్థాయిలో పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు చేపట్టనున్న నేపథ్యంలో దీనిపై దృష్టిపెట్టాలని సూచించారు. జనసేన కార్యకర్తల భద్రతకు త్రిశూల్ అనే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో వైసిపి దుర్మార్గాలకు అడ్డుకట్ట వేసేందుకు టిడిపి, జనసేనతో కలిసి వెళుతున్నామని, కూటమి పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ ముందుకు సాగాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుతో హెచ్చుతగ్గులున్నా రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా సర్దుకుపోవాలన్నారు. పదవులు రాలేదని పార్టీ కేడర్‌లో అసహనం ఉన్నమాట వాస్తవమేనని, ప్రతి కార్యకర్తకు జనసేనలో గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు పంచకర్ల సందీప్, గడ్డం బుజ్జి, పివిఎస్ఎన్. రాజు, వంపురి గంగులయ్య, రాయపురెడ్డి కృష్ణ నాగలక్ష్మి కిరణ్ ప్రసాద్, మంతా నాగసుధ, చందర రావు పాల్గొన్నారు.

పోతిన ప్రసాద్‌కు పరామర్శ

ప్రజాశక్తి-మధురవాడ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందిన జివిఎంసి ఆరోవార్డు వైసిపి అధ్యక్షుడు పోతిన ప్రసాద్‌ను శుక్రవారం వైసిపి భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర పరామర్శించారు. పిఎం.పాలెంలోని ప్రసాద్ నివాసానికి వచ్చి పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏడోవార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, మూర్తి బాబు, ఎల్లాజీ, రామకృష్ణారెడ్డి వరలక్ష్మి అనూష పాల్గొన్నారు.

అంగన్వాడీలకు వేతనాలు పెంచాల్సిందే

◆ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

◆ విశాఖ, అనకాపల్లిలో ధర్నాలు

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 42 రోజుల సమ్మె కాలంలో హామీ ఇచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా అనకాపల్లి కలెక్టరేట్ వద్ద వందలాది మందితో శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తమ సమస్యలపై అంగన్వాడీలు చేసిన నినాదాలతో కలెక్టరేట్ ప్రాంతం దద్దరిల్లింది. ఇందులో పాల్గొన్న నర్సింగరావు మాట్లాడుతూ ఒక వైపు అన్ని రకాల ధరలు భారీగా పెరుగుతున్నా అంగన్వాడీలకు 2019 నుండి వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. కష్టపడుతున్న కార్మికులకు వేతనాలు ఇవ్వటానికి చేతులు రాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలను ధారాదత్తం చేస్తున్నాయని విమర్శించారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు ఇవ్వని ప్రభుత్వం బడా కార్పొరేట్లకు భూములు, వనరులను కారు చౌకగా కట్టబడుతుందని పేర్కొన్నారు. దేశంలో లేబర్ కోడ్స్ తీసుకొచ్చి కార్మికులను పెట్టుబడిదారులకు కట్టుబానిసలను చేసే కుట్ర బిజెపి, టిడిపి ప్రభుత్వాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ లేబర్ కోడ్స్, కార్మిక వ్యతిరేక విధానాలు, స్కీమ్ వర్కర్స్ సమస్యలపై ఈనెల 31 నుండి జరుగుతున్న సిఐటియు అఖిల భారత మహాసభలో చర్చించనున్నామన్నారు. అలాగే 2026 ఫిబ్రవరి నెలలో దేశవ్యాప్త సమ్మె కూడా సన్నద్ధం అవుతున్నామని వెల్లడించారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలకు నష్టం కలిగించే చర్యలు చేపడుతుందని, ప్రీ స్కూలు జరగకుండా ఆన్లైన్ పనుల పేరిట ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లో అంగన్వాడీ వర్కర్లకు హెల్పర్లకు ఒకేసారి సెలవులు ఇవ్వాలని, ప్రమోషన్లు కల్పించాలని, గ్రాడ్యుటీ అమలు కోసం గైడ్లైన్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఎం.జగ్గునాయుడు, జిల్లా అధ్యక్షులు వివి. శ్రీనివాసరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.కుమారి, అధ్యక్షులు పి.దుర్గారాణి, కోశాధికారి రమణమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు వరలక్ష్మి, రామలక్ష్మి, సత్యవేణి, మంగ, సామ్రాజ్యం, మహాలక్ష్మి, తనూజ, కృష్ణవేణి, వందలాది మంది అంగన్వాడీలు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వందలాది మందితో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్ మాట్లాడుతూ 2023 డిసెంబర్ చేపట్టిన 42న రోజుల సమ్మె సందర్భంగా నాటి ప్రతిపక్ష నాయకులు చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీలకు న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని, నాడు పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ కూడా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరైనా నేటికీ వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ నాయకత్వాన్ని పిలిచి చర్చలు జరిపి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ విశాఖ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షురాలు పి.మణి, అధ్యక్ష కార్యదర్శులు ఎల్.దేవి, కె.వెంకటలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.పద్మావతి, కోశాధికారి ఆర్.శోభారాణి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బృందావతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఈశ్వరమ్మ, అర్బన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరి, తులసి, నాయకులు చిన్నమ్మలు, సాయి సరస్వతి, శ్రీదేవి, సూర్యకళ, రమణమ్మ, దేవి, జయశ్రీ, శాంతి, ఇందిరా, శ్రీదేవి, అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

విశాఖలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న రామారావు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కె.కోటపాడు : కె.కోటపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్పర్సన్ చీపురుపల్లి రామారావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని 10 గ్రామాల రైతులు ఈ కేంద్రంలో విక్రయించాలని కోరారు. ధాన్యం 100కేజీల బస్తా నాణ్యతను బట్టి రూ.2,389, రూ.2,369 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రవాణా, గోనెలు, కూలీల ఖర్చులను కూడా ధాన్యం సొమ్ముతో కలిపి రైతుల ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ రుద్ర ఈశ్వరరావు, పిఎసిఎస్ సీఈఓ రొంగలి చినఈశ్వరరావు, సిబ్బంది అక్కునాయుడు, అప్పారావు, రామునాయుడు, నాయుడు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడి కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు ఆధ్వర్యంలో ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రైవేటు స్కూళ్ల వారు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేసి ఐడి కార్డులు ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఐడి కార్డులు జారీ చేసిందని తెలిపారు. స్కూల్ చైర్మన్ పాత్రపల్లి పరదేశమ్మ, పిఎసిఎస్ చైర్మన్ రాజి నారాయణమూర్తి, పాఠశాల హెచ్ఎం జివిఆర్.రాజు పాల్గొన్నారు.

మాదిగ సామాజిక తరగతి ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని దేవీపురంలో మాదిగ సామాజిక తరగతి వారి ఆత్మీయ కలయిక శుక్రవారం జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన మాదిగలు తమ అనుభవాలను పంచుకున్నారు. ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎంఆర్పిఎస్ నాయకులు గొటివాడ సామ్రాట్ కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో గొటివాడ సన్యాసి, కొమ్ము కోటి అప్పారావు, బొర్రా జయరాజు, నిమిడితల్లి చిన్నారావు, దువ్వు మనోహర్, కోరుబిల్లి మారాజు, మారేడుబూడి మహాలక్ష్మి నాయుడు, కొమ్ము చైతన్య, గొటివాడ ప్రవీణ్, చంద్రరావు, శివ, సురేష్, ప్రసాద్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. ఆర్జీలను సంబంధిత అధికారులకు అందించి, సత్వరం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ధూళి రంగనాయకులు, గొర్లి శివన్నారాయణమూర్తి, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, లాలం శ్రీధరత్, పీలా తులసిరాం, మామిడి శివ అప్పారావు, రాజాన సూర్య నాగేశ్వరరావు, కరణం రవికుమార్, రెడ్డి నగేష్, పల్లి వెంకటరావు, దాడి రమేష్, కర్రెళ్ల మల్లికార్జున, సూరకాసుల రమణ, గొర్లి బాబురావు, దంట్ల వెంకటస్వామి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-కశింకోట : టిడిపి మండల అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు, ఆ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ బాబర్ శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అమరావతిలో మార్యదపూర్వకంగా కలిశారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని చంద్రబాబు సూచించినట్లు వారు తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుతో శ్రీనివాసరావు, బాబర్ తదితరులు

సిఎస్‌సి యూనిట్లు మంజూరు

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టల్లో మరుగుదొడ్ల సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ (సిఎస్‌సి) యూనిట్లు మంజూరైనట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.రామానందం తెలిపారు. వాటినిర్మాణం నిమిత్తం గురువారం ఆయన మండలంలోని ఎ.కోడూరు కె.కోటపాడులో వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఒక్కో సిఎస్‌సికి ఏర్పాటుకు రూ.3 లక్షల చొప్పున మంజూరైనట్లు చెప్పారు. పిఎం అజయ్ పథకంలో ఏడు ఆర్ఓ వాటర్ ప్లాంట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎఎస్‌డబ్ల్యూఒ బి.ఈశ్వరరావు, హెచ్‌డబ్ల్యూఒలు రమణ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని జిల్లా, ఏరియా, సామాజిక ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం జీవో ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించి డిసిహెచ్ఎస్.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కృష్ణారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ జీవో 138 ప్రకారం శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ సిబ్బందికి రూ.16000 వేతనంలో కార్మికుని పిఎఫ్, ఈఎస్ఐ వాటగా రూ.2040 మినహాయించి రూ.13960 ప్రతినెలా ఏడవ తేదీ లోపు చెల్లించాలని కోరారు. సూపర్వైజర్లకు రూ.21వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి. రవికుమార్, వడ్డాది పోలరావు, వడ్డాది అప్పలరాజు, నూకరాజు,ఎర్రంశెట్టి వెంకట లక్ష్మి, పాల్గొన్నారు.

కె.కోటపాడు : ప్రభుత్వ ఆసుపత్రుల పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని యూనియన్ జిల్లా నాయకులు లెక్కల లక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బంటుపల్లి లక్ష్మి, టి నాగ రత్నం, అరుణకుమారి, సత్యవతి, పుష్ప, సీహెచ్ లక్ష్మి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

20న ఉచిత ఫిజియోథెరపీ శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్టిఆర్ జిల్లా ఆసుపత్రిలో ఈనెల 20న ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ హైమావతి తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం ఆసుపత్రి డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు, తాడి శాంతి కుమారి రామకృష్ణ, గొర్లి శేఖర్, ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ ప్రియాంక పట్నాయక్ (ఎన్నారై)తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉరుకుల పరుగుల జీవితంలో వయసుతో సంబంధం లేకుండా ఎముకలు, నరాలు, గుండె సంబంధిత వ్యాధులు బాధిస్తున్నాయని చెప్పారు. కొద్దిపాటి వ్యాయామంతో పాటు ఫిజియోథెరపీ ద్వారా ఇలాంటి సమస్యలను తేలికగా అధిగమించవచ్చని పేర్కొన్నారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడే వారికి నడుము, ముడుకులు, పక్షవాతంతో ఉన్నవారికి ఫిజియోథెరపీపై అవగాహన కలిగించి అవసరమైన వారికి వైద్య సేవలు కూడా అందించనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-పరవాడ : పరవాడలోని వసుధా ఫార్మా ఇండస్ట్రీలో శుక్రవారం సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిజిటల్ అరెస్టులు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, జాబ్ ఫ్రాడ్లు, బెట్టింగ్ యాప్స్, ఫేక్ ఏపీకేలు, ఫిషింగ్ లింకులు వంటి సైబర్ మోసాలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయని, అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, యాప్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, సంస్థ ప్రతినిధులు కెవిఎస్ఎన్ రాజు, దీప్ చంద్ ఉపాధ్యాయ, కె.శ్రీనివాసరాజు, శ్రీహర్ష, ఎస్ఆర్.శర్మ, జె.వెంకటేష్, 300 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

డైట్‌లో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, అటానమస్ కళాశాలలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దాడి విద్యాసంస్థల చైర్మన్ దాడి రత్నాకర్ హాజరై మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సెంటర్ సహకారంతో డైట్ ఎన్ఎస్ఎస్, డిఎలొసిసి, డివిసి సంయుక్త ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో డైట్ కళాశాల విద్యార్థులు 424 మంది రక్తదానం చేశారు. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ పి.సత్యనారాయణ, డాక్టర్ కే సోమశేఖర్ పర్యవేక్షణలో నిర్వహించారు. రక్తదానం చేసిన విద్యార్థులందరికీ ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జై గణేష్ ప్రసాద్ రెడ్డి, డీన్ ఎకడమిక్స్ డాక్టర్ బివి ఫణిబాబు, వివిధ విభాగాధిపతులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఏ కిరణ్ కుమార్, డీఎల్ సిసి కన్వీనర్ ఎస్కే షబీనా, ఎన్ఎస్ఎస్, డిఎలొసిసి, డివిసి వాలంటీర్లు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ చేసిన దృశ్యం

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తెలుగుపూడి హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను హెరిటో గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడ్డి శుక్రవారం పంపణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డిఎస్ఎస్వి.ప్రసాద్, ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటరమణ, శ్రీనివాసరావు, మహేశ్వరరావు, మాధవరావు, త్రినాథ్, పద్మావతి, కొండమ్మ, శ్యామల పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి పాత అగనంపూడి పిల్లమ్మ గుడి సెంటర్ వద్ద హైమాస్ట్ లైట్లను స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో ఎక్కడా చీకటి ఉండకుండా వెలుగుతో నిండిన వార్డుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కరణం జగదీశ్, సింగిడి సింహాచలం, హనిత, సుబ్బరాజు, మాడిసా వెంకట్రావు, మామిడి అప్పారావు, గల్లా రాజు, హరిబాబు, పండూరి సూర్య, నాయుడు పాల్గొన్నారు.

జనసేన నేత రాజుకు అస్వస్థత

ప్రజాశక్తి-చోడవరం : జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు అస్వస్థతకు గురయ్యారు. విశాఖలో జరుగుతున్న జిల్లా మీటింగ్‌లో పాల్గొన్న ఆయన ఒకసారిగా స్టేజిపై మాట్లాడుతూ కుప్పకూలడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గురువారం రాజు పుట్టినరోజు కావడంతో రావికమతం మండలం చలిసింగి గ్రామంలో గిరిజనుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకొని రాత్రి అంతా అక్కడే గడపడంతో అప్పటికే జ్వరంతో బాధపడుతున్న ఆయన అస్వస్థకు గురైనట్లు పార్టీ శ్రేణులు తెలిపాయి.

ఇంటి పన్నుల వసూలు

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని దార్లపూడి, గోకులపాడు గ్రామాల్లో జరుగుతున్న ఇంటి పన్నులు వసూలు కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ కార్యదర్శి ఆన్లైన్‌లో మాత్రమే ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ప్రజలు నేరుగా పంచాయతీ ఆఫీసుకు వెళ్లాల్సిన అవసరం లేదని, కరెంట్ బిల్లు మాదిరిగా వారే ఆన్లైన్‌లో ఇంటి పన్నులు చెల్లించవచ్చని చెప్పారు.

ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని సర్వసిద్ధి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి.రామారావు విగ్రహాన్ని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు శుక్రవారం ఆవిష్కరించారు. టిడిపి సీనియర్ నాయకులు మలిజెడ్డి అప్పలకొండ ప్రథమ వర్ధంతి సందర్భంగా మాజీ సర్పంచ్ పడమట సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చలపతిరావు మాట్లాడుతూ అప్పలకొండ వంటి నాయకులే పార్టీకి వెన్నుముఖ అని, పార్టీ సభ్యత్వం తీసుకున్నప్పటి నుండి చనిపోయే వరకు పార్టీ కోసం పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు అమలాకంటి అబద్దం, నాయకులు నల్లపురాజు వెంకటరాజు, కొమ్మిరెడ్డి నాగలక్ష్మి, దుబాసి జోతి, పిఎసిఎస్ అధ్యక్షులు తుంపాలా నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, సర్పంచ్‌లు వజ్రపు శంకరరావు, రావి రమణబాబు, మాజీ సర్పంచ్‌లు పినపాత్రుని సూర్యనారాయణ, బోయినా రామావతారం, నాగేశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చలపతిరావు తదితరులు

18 నుంచి జాతీయ వినియోగదారుల వారోత్సవాలు

జిల్లా రెవిన్యూ అధికారి సత్యనారాయణరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 18 నుంచి 24 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టరు కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 'డిజిటల్ న్యాయపాలన ద్వారా సమర్థ సత్వర పరిష్కారం' అంశంపై విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10వేలు, రూ.7,500, రూ.5 వేలు నగదు, ప్రశంసా పత్రాలను విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో అందజేస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు నగదు, ప్రశంసా పత్రాలను అందజేయడం జరుగుతుందని చెప్పారు. వినియోగదారుల హక్కులపై అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమాచారం, విద్య, కమ్యూనికేషన్ సామగ్రితో ఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లై అధికారి కెవిఎల్ఎన్.మూర్తి, డిఇఒ జి.అప్పారావునాయుడు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం.వినోద్ కుమార్, తూనికల కొలతలశాఖ సహాయ కంట్రోలర్ బి.రామచంద్రయ్య, ఫుడ్ ఇన్స్పెక్టరు కె.సతీష్ కుమార్, వినియోగదారుల సంఘాల అధ్యక్షులు కాండ్రేగుల వెంకటరమణ, ఎన్.సంజీవరావు, బి.త్రినాధరాజు, రెడ్డి సత్యనారాయణ, పి.భుననేశ్వరరావు, ఆర్.రాంబాబు, ఆర్.శివసత్యనారాయణ, ఎం.యల్లారావు, పి.రాజు, ఇఎస్ఎన్.మూర్తి, డిఎస్ఎస్.భవాని, కెవి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఆర్ఒ సత్యనారాయణరావు తదితరులు

ఎపి ఎన్‌జివోస్ కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ప్రజాశక్తి-సబ్బవరం : ఎపి ఎన్‌జిజిఓ అసోసియేషన్ సబ్బవరం తాలూకా యూనిట్ కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఈ ఎన్నికల్లో ఒక్కొక్క పోస్టుకు ఒక్కో అభ్యర్థి మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి కె.శ్రీనివాస్, సహాయక అధికారి సత్యనారాయణ ప్రకటించారు. ఈ ఎన్నికలకు పర్యవేక్షణ అధికారిగా ఏజె సత్యనారాయణ వ్యవహరించారు. సబ్బవరం తాలూకా యూనిట్ అధ్యక్షులుగా కే.జేసుదాస్, అసోసియేటెడ్ అధ్యక్షులుగా కే.నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాసరావు, బివిఎస్.ఫణికుమార్, కెవి.రమణారావు, కార్యదర్శిగా పికెవి నారాయణరావు, సంయుక్త కార్యదర్శులుగా కెఎల్‌వి కిరణ్‌కుమార్, కే.జానకిరామ్, టి.విజయ్ కుమారి, టి.రేణుక, నాగినీదేవి, కోశాధికారిగా ఎన్.మురళి మోహన్ ఎన్నికయ్యారు. ఎన్నికలు పరిశీలకులు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిని అనకాపల్లి జిల్లా ఏడిహెచ్ఓసి చైర్మన్ పీలా సూర్యనారాయణ, కన్వీనర్ శేషుకుమార్, కమిటీ సభ్యులు సత్యనారాయణ, ఆనంద్ అభినందించారు.

పారిశుధ్య కార్మికుల జీతాలకు ఎమ్మెల్యే సర్దుబాటు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పంచాయతీ పారిశుధ్య కార్మికులకు జీతాలు బకాయి చెల్లింపునకు సర్దుబాటు నిమిత్తం స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తమ సొంత నగదు రూ.10 లక్షలు పంచాయతీ ఇఒ కె.శ్రీనివాసరావుకు శుక్రవారం అందజేశారు. ఈ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల జీతాలు బకాయి ఉంది. జనరల్ ఫండ్ అకౌంట్‌లో ఉన్న నగదు ప్రస్తుత తీసుకోవడానికి వీలు కాకపోవడంతో జీతాలు ఆలస్యం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే తన సొంత నగదు సర్దుబాటు చేశారు. ఈ మొత్తంతో పాటు తోడు పంచాయతీలో ఉన్న రూ.6 లక్షలు కలిపి మొత్తం రూ.16 లక్షలు పారిశుధ్య కార్మికులకు రెండు నెలల జీతం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండి నూకాలమ్మ, పంచాయతీ గుమస్తాలు సాహో, రాజా, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కింతాడ పంచాయతీ పరిధి గొంపవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) మండల కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మండల అధ్యక్షురాలుగా రొంగలి ఉమాదేవి, ప్రధాన కార్యదర్శిగా ఇమంది అశోక్ కుమార్, గౌరవాధ్యక్షులుగా సెల్వరాజ్, సహ అధ్యక్షులుగా ఎల్.పుష్పా, పి.రమేష్, కోశాధికారిగా సిహెచ్.స్వామినాయుడు, కార్యదర్శులుగా కె.అరుణకుమారి, కె.రమాదేవి, ఆర్.శంకరరావు, కె.శాంతి, జిల్లా కౌన్సిలర్లుగా టి.సునీతకుమారిసాహు, ఎం.రాణి, ఆడిట్ కమిటీ మెంబర్లుగా ఇ.అనురాధ, జి.స్వాతి ఎన్నికయ్యారు.

దుర్గాలమ్మ అమ్మవారికి వెండి ఆభరణాలు వితరణ

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని రాయపురాజుపేట శ్రీదుర్గాలమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా అమ్మవారికి గ్రామ మాజీ సర్పంచ్ బొడ్డేడ అచ్చియమ్మ, ఆమె కుమారులు బొడ్డేడ నాగ గంగాధర్ సంధ్య దంపతులు, వెంకటగణేష్ భార్గవి దంపతులు వెండి ఆభరణాలు వితరణ చేశారు. రూ.65వేలు విలువైన 25 తులాల వెండి వస్తువులు అమ్మవారి అలంకరించారు. గుడి నిర్మాణ నిమిత్తం మరో రూ.50 వేలు విరాళం అందించారు. ఈ మేరకు గ్రామస్తులు వారిని అభినందించారు.

అమ్మవారికి అలంకరించిన ఆభరణాలు

మాట్లాడుతున్న ఎపిపి రాజాన శేషు

ఆసుపత్రిని సందర్శించిన ఎంపిపి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి మండలం, రేగుపాలెం ప్రభుత్వ ఆసుపత్రిని నూతన ఎంపిపి రాజాన సూర్యచంద్రశేఖరిరావు శుక్రవారం సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయుర్వేద ఔషధాలు నిల్వ గది కావాలని, ఆశ వర్కర్లకు మీటింగ్ హాల్ కావాలని వారు కోరారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, కూటమి నాయకులు తమ గ్రామ సమస్యలను ఎంపీపీకి తెలియజేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతు బజార్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని కోరుతూ నెహ్రూ చౌక్ సెంటర్లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆప్ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు మాట్లాడుతూ 14 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎల్లపు రామశేషు, ఎస్ ప్రకాష్, గొర్లి వెంకటేశ్వరరావు, అట్లపోయి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మునగపాక : రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను టిడిపి మండల నాయకులు గురువారం రాత్రి విశాఖపట్నం విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మునగపాక మండలంలో టిడిపి శ్రేణులపై జరుగుతున్న అన్యాయాలను, నాయకులు చేసిన తీర్మానాలను నివేదిక రూపంలో లోకేష్‌కు అందజేసినట్లు ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన లోకేష్ త్వరలోనే ఈ విషయంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు భీమరశెట్టి చెప్పారు.

సుబ్రహ్మణ్య భారతి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట జెడ్పి హైస్కూల్‌లో శుక్రవారం భారతీయ భాషా ఉత్సవ్‌లో భాగంగా ప్రముఖ తమిళ కవి, స్వాతంత్ర్య సమరయోధుడు సుబ్రహ్మణ్య భారతి జయంతి వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం ఆకుల అప్పాజీ సురేష్ మాట్లాడుతూ మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఐడి కార్డులను పంపిణీ చేశారు.

నివాళులర్పిస్తున్న విద్యార్థులు

27 మందికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట నియోజకవర్గం లో నాలుగు మండలాలకు సంబంధించి 27 మంది లబ్ధిదారులకు 25 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను టిడిపి ముఖ్య నాయకులు అందజేశారు. నక్కపల్లి హోం మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద శుక్రవారం పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. లబ్ధిదారులు గరికిన తాతారావు కు రూ.1,07,423, తిరుమలసెట్టి శివ కు 20,524, రాపర్తి శంకరరావు కు 30,798, కోత లక్ష్మి కు 60 వేలు, కారే యేసు కు 37,836, ప్రసాదుల అశోక్ బాబు కు 91,846, కారే లోవరాజు కు 32,492, కంబాల అమ్మోరియ్య కు 1,01,454,షేక్. షిలార్ బీబీ కు 25 వేలు,కర్రి లోవ కుమారి కు 35,028,సంపతి రాజా కు 2,51,377 కట్ట పార్వతి కు 45,541,గుంటూరు ధరణి శ్రీజ కు 2 లక్షలు,గొర్ల సత్యవతి కు 2,78,620,చొక్కా పాండు కు 15 వేలు,దేవవరపు రాంబాబు కు 48,483, ఓసిపిల్లి అప్పల దుర్గయ్య కు 31,377, గంగిరి వేణమ్మ కు 30 వేలు,సూరాడ దేవుడు కు 2,80,578, తదితర లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, పాయకరావుపేట మండల పార్టీ శాఖ అధ్యక్షులు పద్దు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబాబు, పాయకరావుపేట నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు రమా కుమారి, నక్కపల్లి మండలమహిళా అధ్యక్షురాలు మున్నీషా బేగం, గొడిచెర్ల పిఎసిఎస్ అధ్యక్షులు దార్ల కృష్ణ టిడిపి నాయకులు నూకరాజు, చిన్న తాతారావు, వైబోయిన రమణ, అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకర్రావు, పుణ్యమంతుల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధదారులకు చెక్కులు అందజేస్తున్న టిడిపి శ్రేణులు

కిట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది, హెచ్ఎం

పీర్ ఎడ్యుకేటర్లకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కవగుంట ఎంపీయుపీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు కుసుమ, జోష్ణ, నాగతేజ, రోహితులను పీర్ ఎడ్యుకేటర్లుగా ఎంపిక చేసి రావికమతం పీహెచ్సీ ఆరోగ్య సిబ్బంది వారికి ప్రత్యేక కోటు, క్యాప్‌లను సర్పంచ్ దాసరి కుమారి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. మండల స్థాయిలో ఇలా అన్ని పాఠశాలల్లో ఎంపిక చేసిన వారందరికీ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వీరి చేత ఆయా పాఠశాలలో ఉన్న మిగిలిన విద్యార్థులు అందరికీ ఆరోగ్య సూత్రాలు, తగు సూచనలు, సలహాలు, పారిశుధ్యం పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని ఏఎన్ఎం ప్రభ అన్నారు. వీరితో అవగాహన కార్యక్రమాలు చేపతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రాజబాబు, పాఠశాల సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో బాల్య వివాహాలు ఎట్టి పరిస్థితుల్లో జరగడానికి వీలు లేదని ఎంపీడీవో మహేష్ తెలిపారు. వెలుగు కార్యాలయంలో శుక్రవారం వెలుగు సిబ్బంది, స్వయం సహాయక సంఘ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహేష్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు పూర్తిగా చట్ట వ్యతిరేకమన్నారు. బాల్య వివాహాలతో ఎదురయ్యే అనర్థాలను స్వయం సహాయక సంఘ సభ్యులు గ్రామంలో ప్రచారం చేయాలన్నారు. తక్కువ వయసులో వివాహం జరగడంతో తల్లి, బిడ్డకు అనారోగ్యం తో పాటు పుట్టిన పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉండరన్నారు. ఆడ మగకు తగిన వయసు వచ్చిన తరువాతనే వివాహాలు చేయాలన్నారు. బాల్యవివాహాలను గుట్టు చప్పుడుగా నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ మంగతాయారు, వెలుగు ఏపీఎమ్ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల:బాల్య వివాహాలు -అనర్థాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో జి.ఎర్రయ్యమ్మ అన్నారు. స్థానిక విజ్ఞాన్ పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమంను

కె.కోటపాడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న పిఒ

రావికమతంలో అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భేటీ బచావో... బేటీ పడావో కార్యక్రమంలో బాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు, పాల్గొన్నారు.

కె.కోటపాడు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ పిఒ లలిత కుమారి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన బాల వివాహ ముక్తి భారత్ కార్యక్రమంలో విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే 1098 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగమణి, అధ్యాపకులు, అంగన్వాడీ సూపర్వైజర్స్ ఎల్‌బి సుశీల, ఎం.కళ్యాణి, ఆదిలక్ష్మి రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : బాల్య వివాహాల ముక్తభారత కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాళ్లపాలెం జడ్పీహెచ్ స్కూల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిడిపివో శశికళ, ఎల్‌ఈ పి.రామాదేవి, స్కూల్ హెచ్ఎం ప్రసాద్‌రావు, సూపర్‌వైజర్ సునీత, సచివాలయం పోలీస్ గీత ప్రసన్న పాల్గొన్నారు.

జోరుగా సిఐటియు జాతీయ మహాసభ ప్రచారం

పరవాడలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పరవాడ : విశాఖపట్నంలో ఈ నెల 31నుండి జనవరి 4వ తేదీ వరకు జరుగు సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పరవాడ సినిమా హాల్ జంక్షన్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ జయప్రదానికి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ చారిత్రాత్మకమైన విశాఖపట్నంలో మొదటిసారిగా సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. జనవరి 4న ఆర్కె బీచ్‌లో జరుగు బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు కార్మికుల హక్కులపై దాడి చేస్తున్నాయని, పని గంటలు పెంచి కార్మికులను కట్టుబానిసలుగా మార్చుతున్నాయని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో జరుగు దేశ వ్యాప్త కార్మిక ఉద్యమాలకు ఈ మహాసభలు నాంది కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, అన్నపూర్ణ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్:విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదంకై భవన నిర్మాణ కార్మికులు నర్సీపట్నంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, ఉపాధ్యక్షులు శివ మాట్లాడుతూ, విశాఖపట్నంలో మొదటిసారిగా సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగుతున్నాయన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు కార్మికుల హక్కులపై దాడి చేస్తున్నాయన్నారు. పని గంటలు పెంచాయన్నారు. రాష్ట్రంలో సుమారు పాతిక లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు గత ఏడేళ్ల కాలంలో అనేక సంక్షేమ చట్టాల అమలుకు నోచుకోకుండా ఉన్నారన్నారు.. నాడు వైసిపి నేడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు భవన నిర్మాణ సంక్షేమ చట్టాలు అమలు చేయడంలో ఏమాత్రం కూడా బాధ్యత లేకుండా ఉన్నాయని తెలిపారు. సంక్షేమ బోర్డులో వేల కోట్ల రూపాయలను ప్రభుత్వ అవసరాలకు వాడుకొని కార్మికులను ఇబ్బంది పాలు చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో ఈ విధానాలకు వ్యతిరేకంగా జరుగు దేశ వ్యాప్త కార్మిక ఉద్యమాలకు ఈ మహాసభలు నాంది కానున్నాయన్నారు. జిల్లాల్లో యావత్ భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నాగులాపల్లి గోవింద్, రెడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ప్రచారం చేస్తున్న నాయకులు

నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ఏఎల్.పురం గ్రామంలో జడ్పీహెచ్ హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు (1987-1988) తమ ఉదారతను చాటుకున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన లోకవరపు వెంకటరమణ ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కాలు విరిగిపోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన తోటి స్నేహితులు తక్షణమే స్పందించి వెంకటరమణను ఆదుకోవాలని అనుకున్నారు. తోటి విద్యార్థులంతా ఒకరికొకరు సంప్రదించుకుని, ఆర్థిక సాయం అందించాలని ఆలోచనతో వీరంతా కలిసి రూ.30500 సహాయం చేశారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వెంకటరమణ ఆదుకోవడం తమ బాధ్యతగా భావించామన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, క్లిష్ట సమయంలో స్నేహితులు అందించిన సహాయంపై భావోద్వేగానికి గురయ్యాడు. ఈ కార్యక్రమంలో శ్రీశైలపు జోగునాధం, గాడిశ్రీను, లాలం నానిబాబు, సుర్ల హైమవతి, చిటికెల సురేష్, సాంబమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేష్

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి నిధుల మంజూరు

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట నియోజక వర్గంలో గ్రామీణ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. నక్కపల్లిలో హోంమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద శుక్రవారం పార్టీ ముఖ్య నాయకులతో కలిసి వెంకటేష్ మాట్లాడారు. పాయకరావుపేట నియోజకవర్గంలో 13 గ్రామీణ రహదారులు అభివృద్ధికి రూ.18.16 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, హోం మంత్రి వంగలపూడి అనితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, పాయకరావుపేట మండల పార్టీ శాఖ అధ్యక్షులు పద్దు, టిడిపి నేతలు చిట్టిబాబు, వరహాలు బాబు, రమా కుమారి, మున్నీషా బేగం, దార్ల కృష్ణ, నూకరాజు, తాతారావు, వైబోయిన రమణ, పెదపూడి శంకర్రావు, పుణ్యమంతుల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సూచనలు ఇస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ చలపతిరావు

తడి, పొడి చెత్తను సేకరించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:ఇంటింటా తడి పొడి చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలించాలని డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పారిశుధ్య కార్మికులకు సూచించారు. మండలంలో రాజయ్యపేటలో శుక్రవారం చెత్త సేకరణను పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి సత్యం, పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ఉద్దండపురం లో సమీత్వ సర్వేను పరిశీలించారు. సర్వే పక్కాగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. చెత్త తొలగింపును పరిశీలించారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శాస్త్రి

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని సాగరం కాలనీలో ఈ నెల 6 నుంచి 12 వరకు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ శాస్త్రి, కళాశాల సీపీడీసీ చైర్మన్ దేవరాపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆయన ఈ శిబిరాలను ఉద్దేశించి మాట్లాడారు. సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలను వెలుగులోకి వస్తాయన్నారు. విద్యార్థులు ఉత్తమ పలితాలు సాధించి మాతృభూమికి సేవ చేయాలని సూచించారు. ప్రోగ్రాం అధికారి రామ్‌కుమార్ ఈ వారం రోజుల్లో జరిగిన కార్యక్రమాను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, సర్పంచి జయమ్మ, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

వీధి కుక్కలకు రేబిస్ టీకాలు

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగులలో శుక్రవారం వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందని ఏరియా సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. సుమారుగా 18 కుక్కలకు టీకాలు వేశామన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచి ఆధ్వర్యంలో నియమించిన సిబ్బంది సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేయడం జరుగుతుందన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న పంచకర్ల రమేష్ బాబు

జనసేనలో చేరిక

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలో కింతలి వల్లా పురం గ్రామ శాఖ జనసేన అధ్యక్షులు అశోక్ ఆధ్వర్యంలో మాజీ డీలర్ రాగిన అప్పారావు, తదితరులు ఆ పార్టీలో చేశారు. వేపగుంట మీనాక్షి ఫంక్షన్ హాల్ లో జనసేన విస్తతస్థాయి సమావేశంలో విశాఖ రూరల్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు శివాజీ, ఉపాధ్యక్షుడు కోన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దాసరి అచ్యుతరావు, పిఏసిఎస్ అధ్యక్షులు పిల్ల నాయుడు, తలారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఓటును వేస్తున్న విద్యార్థులు

స్టూడెంట్ లీడర్స్ ఎన్నికలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: మండలంలోని తురకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శుక్రవారం పాఠశాల స్టూడెంట్ లీడర్స్ ఎన్నికను ఉపాధ్యాయులు నిర్వహించారు. ఎన్నిక ప్రక్రియలో భాగంగా నామినేషన్‌ల బ్యాలెట్ ద్వారా ఎన్నిక, ఓటు హక్కు వినియోగం, ఫలితాల వెల్లడి, తదితర ప్రక్రియను నిర్వహించి ఫలితాలను వెల్లడించారు. స్కూల్ పీపుల్స్ లీడర్లుగా ఏ.ఇంద్రజ, వైస్ పీపుల్స్ లీడర్ గా కే.అనుషలను విద్యార్థులు ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను సోషల్ ఉపాధ్యాయులు కె. శ్రీను నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు కే.చంద్రకళ, రాజు రమణాజీ తదితరులు అభినందించారు.

సిఎంకు ఘన స్వాగతం, వీడ్కోలు

సిఎంకు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- గ్రేటర్‌విశాఖబ్యూరో: విశాఖ జిల్లాలో ఒకరోజు పర్యటనలో భాగంగా వాయుమార్గం ద్వారా శుక్రవారం ఉదయం నగరానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కి స్థానిక నేతలు, అధికారుల నుంచి ఘన స్వాగతం లభించింది. విశాఖలోని కాపులుప్పాడ సమీపంలోని ఐటీ హిల్స్ వద్ద అంతర్జాతీయ ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీస్ కంపెనీ నూతన క్యాంపస్ భవన నిర్మాణ శంకుస్థాపన, కార్యకలాపాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయం 12:10 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పార్లమెంట్ సభ్యులు ఎమ్. భరత్, ప్రభుత్వ విప్ గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాస్, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఏపీ ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, వివిఎంఆర్డిఏ కమిషనర్ తేజ్ భరత్, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు.అదే విదంగా సాయంత్రంగా ఘనంగా వీడ్కోలు పలికారు.

అనకాపల్లి రూరల్ : విశాఖపట్నం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విశాఖ విమానాశ్రయంలో అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు స్వాగతం పలికారు. కాసేపు స్థానిక రాజకీయాలపై చర్చించారు.

ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పురోగతిపై సిఎం ఏరియల్ విజిట్

ప్రజాశక్తి -గ్రేటర్ విశాఖ బ్యూరో:ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాజెక్టుల పురోగతి తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం సాయంత్రం ఏరియల్ సర్వే నిర్వహించారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో సమీక్ష అనంతరం ఆ ప్రాంతంలోని వివిధ ప్రాజెక్టుల నిర్మాణ పురోగతిని సీఎం హెలికాప్టర్ ద్వారా వీక్షించారు. నిర్మాణ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విశాఖ ఐటీ సెజ్ విస్తరించిన కాపులుప్పాడ వద్ద ఐటీ హబ్, జీసీసీ ప్రాజెక్టుల నిర్మాణాలను సీఎం పరిశీలించారు. సాగర తీరాన్ని ఆనుకుని భీమిలి వద్ద ఏర్పాటు అవుతున్న టూరిజం హబ్ ప్రాంతాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు హెలికాప్టర్ నుంచి తిలకించారు. అక్కడకు సమీపంలోనే భోగాపురం వద్ద నిర్మాణంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయ పనుల పురోగతిని పరిశీలించారు. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు రహదారుల కనెక్టివిటితో పాటు అనుసంధానంగా టౌన్ షిప్ అభివృద్ధి తదితర పనులకు సంబంధించి అధికారులకు సూచనలు చేశారు. అలాగే భోగాపురం వద్దే ఎడ్యుకేషన్ హబ్ లో భాగంగా ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విశాఖలోని ఆనందపురం వద్ద వివిధ డేటా సెంటర్లకు కేటాయించిన భూములను కూడా సీఎం ఏరియల్ విజిట్ ద్వారా పరిశీలన చేశారు. వీటితో విశాఖ ఎకనామిక్ రీజియన్ లో భాగంగా సబ్బవరం, పెందుర్తి మండలాల్లో వచ్చే వివిధ పరిశ్రమలకు సంబంధించి ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు భూముల లభ్యత గురించి కూడా ముఖ్యమంత్రి ఆరా తీశారు. హెలికాప్టర్ ద్వారా ఏరియల్ విజిట్ చేసిన సీఎం విశాఖ ఎకనామిక్ రీజియన్ పరిధిలో ఐటీ, ఫార్మా, ఇండస్ట్రియల్ తదితర క్లస్టర్లు, పోర్టులు, ఎయిర్ పోర్టులకు రోడ్డు, రైల్ కనెక్టివిటితో పాటు లాజిస్టిక్స్ కు సంబంధించి కూడా అధికారులకు సూచనలు చేశారు.

బెల్టు షాపులపై ఉక్కు పాదం మోపాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:అక్రమ మద్యం నివారణపై అందరూ గట్టిగా కృషి చేయాలని, బెల్టు షాపులపై ఉక్కు పాదం మోపాలని, నాటు సారా కల్తీ మద్యం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని, రాష్ట్ర ఎక్సైజ్ మరియు భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. అధికారుల పనితీరు ఫలితాలు గురించి తెలుసుకున్నారు. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎక్సైజ్ అధికారులతో విశాఖపట్నం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ శుక్రవారం సమీక్ష సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జోనల్ కమాండ్ నియంత్రణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ జెఎన్‌పిసిలో పారిశ్రామిక భద్రత, అత్యవసర పరిస్థితుల్లో సమన్వయ చర్యల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జోనల్ కమాండ్ నియంత్రణ కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్యాస్ లీకేజీ సమూనా సాధనను (మాక్ డ్రిల్) ఎస్పీ సమీక్షించారు. అగ్నిమాపక వాహనాలు, అంబులెన్సులు, క్రేన్లు, పోలీసు రక్షణ వాహనాలు వంటి సేవలను ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉంచేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. సమాచారం చేరవేత, సంఘటన నియంత్రణ కేంద్ర ఏర్పాటు, గ్యాస్ నిర్వీర్యం, క్షతగాత్రుల తరలింపు, సిబ్బంది తరలింపు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రతను అత్యంత ప్రాముఖ్యతగా పరిగణించాలని సూచించారు. ప్రమాదం సంభవించిన వెంటనే నిజమైన సమాచారాన్ని పరిశ్రమలు అందించాలన్నారు. జెఎన్‌పిసిలో పనిచేస్తున్న వలస కార్మికుల వివరాలను పరిశ్రమలు కచ్చితంగా నమోదు చేసుకోవాలని ఆదేశించారు. పరవాడ పారిశ్రామిక ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసుల పహారా విధులను బలోపేతం చేసేందుకు ఎంఏఎస్ఆర్ఎమ్ సంస్థ బొలెరో వాహనాన్ని విరాళంగా అందించింది. ఈ వాహనాన్ని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పరిశ్రమల సంయుక్త ప్రధాన పరిశీలకుడు జె.శివశంకర్‌రెడ్డి, బాయిలర్ పరిశీలకుడు వీరభద్రరావు, జెఎన్‌పిసిఎంఎ ఉపాధ్యక్షుడు ఎన్.సూర్యప్రకాశ్‌రావు, కార్యదర్శి జెట్టి సుబ్బారావు, విశాఖ ఫార్మాసిటీ నిర్వాహక అధికారి డాక్టర్ పిపి.లాల్‌కృష్ణ, పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, సీఐ ఆర్.మల్లికార్జునరావు, అచ్యుతాపురం సీఐ చంద్రశేఖర్, రాంబిల్లి సీఐ నర్సింగరావు, ఎంఏఎస్ఆర్ఎమ్ ప్రతినిధి మునిరత్నం పాల్గొన్నారు.

వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పి తుహిన్ సిన్హా

తిమ్మరాజుపేటలో పశు వైద్య శిబిరం

రైతులకు మందులు అందజేస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పశువులకు సోకిన వ్యాధులపై ఏపీ రైతు సంఘం ఆందోళన నేపథ్యంలో పశు వైద్య శాఖ అధికారులు స్పందించారు. తిమ్మరాజుపేట గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సిబ్బందిని తరలివచ్చి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పాడి రైతులతో మాట్లాడి పశువులకు సోకిన వ్యాధుల గురించి తెలుసుకున్నారు. అనంతరం పాడి పశువులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులకు ఉచితంగా పశుదాణా ఇస్తామని చెప్పి ఇంత వరకు ఇవ్వలేదన్నారు. పశువులకు బలాన్ని చేకూర్చే విధంగా మినరల్ మిక్సర్ పశుదానా టాబ్లెట్లు వంటివి ఇవ్వాలని కోరారు. ఈ శిబిరంలో సిఐటియు మండల కన్వీనర్ కె సోము నాయుడు, ఏపీ రైతు సంఘం ప్రతినిధులు శరగడము రాము నాయుడు, ఎస్ శివ బాపు నాయుడు, శరగడము జగ్గారావు, ఆడారి అర్జున్, కర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాకను అనకాపల్లి డివిజన్‌లో కొనసాగించాలి

ప్రజాశక్తి-మునగపాక : మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్లో కొనసాగించాలని కోరుతూ స్థానిక మెయిన్ రోడ్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 5వ రోజుకు చేరుకున్నాయి. గంటవానిపాలెం, ఉమ్మలాడ, పి.ఆనందపురం, కుమారపురం గ్రామాల నాయకులు దీక్షల్లో కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని వైకాపా అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ సందర్శించారు. అధికార పార్టీ నాయకులు మౌనం వీడి ప్రభుత్వ పెద్దలకు సమస్యను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చయ్య నాయుడు, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, బీసెట్టి గంగ అప్పలనాయుడు, పెంటకోట సత్యనారాయణ, శీర రమణమ్మ, పెతకం శెట్టి రామ జోగినాయుడు, చదరం గణేష్ నాయుడు పాల్గొన్నారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వైసిపి నేత ప్రసాద్